## క్లుప్తంగా

### 25న ప్రజావేదిక

తోట్లవల్లూరు: ఉపాధిహామీ పనులపై ఈ నెల 25న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కేఎస్ రవికాంత్ తెలిపారు. 2023–24 మధ్య కాలంలో జరిగిన పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉపాధి కూలీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్లు హాజరు కావాలని కోరారు.

### ముగిసిన మహాయోగిని బ్రహ్మోత్సవాలు



పమిడిముక్కల: పెనుమత్స శ్రీ మహాయోగిని ఆలయంలో ఎనిమిది రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయంలో ఆంజనేయస్వామికి తమలపాకులతో సమస్రనామ పూజ, శాంతి హోమం చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు దాతల సహకారంతో అన్నసంతర్పణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద తొమ్మిది రోజుల పాటు భజనలు, కోలాటం చేసిన వారిని ఆలయ కమిటీ సత్కరించింది.

### రైతులకు ఇచ్చిన హామీ ఉల్లంఘన

పామర్రు: 2024–25 ధాన్యం సేకరణ ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో తీసుకుంటుందని చివరి తేదీ ప్రకటించడం రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉల్లంఘించడమేనని కృష్ణా జిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు ఈ నెల 31తో కొనుగోలు కేంద్రాలను మూసి వేయటం రైతులకు అన్యాయం చేయటం కాదా అని ప్రశ్నించారు. జిల్లాలో ఇంకా 30శాతం వరకు వరి కుప్పల నూర్పిళ్లు చేయాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మార్చి 31 డెడ్ లైన్ ఉపసంహరించుకుని రైతుల వద్ద ఉన్న చివరి వరి గింజ వరకు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### రేషను కార్డుల లబ్ధిదారుల ఈకేవైసీ పరిశీలన



గుడ్లవల్లేరు: రేషను కార్డుల లబ్ధిదారులకు సంబంధించిన ఈకేవైసీ పరిశీలన కార్యక్రమాన్ని శనివారం గుడ్లవల్లేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వో శాయన ప్రకాష్ మాట్లాడుతూ రేషను కార్డుల్లో లబ్ధిదారులంతా ఈకేవైసీ కలిగి ఉండాలని తెలిపారు. ఈకేవైసీ లేనటువంటి లబ్ధిదారులు రేషను బియ్యం తీసుకునేందుకు అర్హులు కారని పేర్కొన్నారు.

### రేపు హుండీల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లోని హుండీలను సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ మాధవీలత తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు సంప్రదాయ దుస్తులలో లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

### కోడి పందేల నివారణకు చర్యలు



మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గ్రామంలో కోడిపందేలు నివారణకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం పోలీసుల నిఘాను ఏర్పాటు చేశారు. శనివారం సాక్షి పత్రికలో యథేచ్ఛగా కోడిపందెలు అనే కథనం ప్రచురితమైనది. ఈ ఎస్పీ స్పందించి పోలీసుల నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో గ్రామంలో పోలీసులు నిఘా ఉండటంతో కోడి పందేలకు చెక్ పడింది.

### 1,520 మందితో ఉపాధి పనులు

పామర్రు: మండలంలోని పంచాయతీల్లో 1,520 మందితో ఉపాధి పనులు నిర్వహించినట్లు ఏపీఓ సురేష్ తెలిపారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించి కూలీల మస్టర్లను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి పనులు ఎంతగానో ఊతం ఇస్తున్నాయన్నారు. పంట కాలువల్లో పూడిక తీత, పంట బోదెల్లో మట్టి తవ్వు పనులను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# మోటారు వైర్ల చోరీలతో రైతుల ఆందోళన

**పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు**



చాగంటిపాడులో మోటారు వైరును కత్తిరించి అపహరించిన దొంగలు



వల్లూరుపాలెం లంకలో రాగితీగ కోసం వైర్లను కాల్చిన దొంగలు

తోట్లవల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాల్లో విద్యుత్ మోటారు వైర్ల చోరీలతో అన్నదాతలు హడలిపోతున్నారు. రోజుల వ్యవధిలో వరుస చోరీలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిఘా వ్యవస్థ నిర్లక్ష్యంతోనే దొంగలు యథేచ్ఛగా మోటారు వైర్ల చోరీకి పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో వ్యవసాయ మోటార్లకు వినియోగించే కేబుల్ వైర్లను రాత్రిళ్ల కత్తిరించి తస్కరిస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. మోటారు నుంచి మీటరు బోర్డుకు మధ్యలో ఉండే కేబుల్ వైర్లను అడ్డగోలుగా కట్ చేసి దోచేస్తున్నారు. వందలాది సబ్ మెర్సిబుల్ మోటార్లకు చెందిన కేబుల్ వైర్లను అపహరిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

**400 మంది బాధితులు**

విద్యుత్ మోటార్ల వైర్ల వరుస చోరీతో రైతులు బెంబేలెత్తుతున్నారు. 15 రోజుల వ్యవధిలో వల్లూరుపాలెం, పెనమకూరు, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, పాములలంక గ్రామాలకు చెందిన సుమారు 400 మంది రైతులకు చెందిన మోటారు వైర్లను దొంగలు చోరీ చేశారు. ఈ చోరీలతో ఒక్కో రైతుకు రూ. 3 వేలు లెక్కన మొత్తం నష్టం విలువ రూ. 12 లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

**పోలీసుల నిర్లక్ష్యం**

విద్యుత్ మోటారు వైర్ల చోరీలను అడ్డుకునే విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దొంగలు రాత్రి వేళల్లో యథేచ్ఛగా పొలాల్లో తిరుగుతూ వైర్లు కత్తిరిస్తున్నా సరైన చర్యలు తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీ చేసిన తీగలను పొలాల్లోనే కాల్చి, దానిలోని రాగి తీగను అపహరిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి నిఘా వ్యవస్థను పటిష్టం చేసి విద్యుత్ తీగల దొంగల ముఠాకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

**చోరీలు అరికట్టాలి**



వ్యవసాయ మోటార్లకు సంబంధించి విద్యుత్ వైర్ల దొంగతనాలు ఇటీవల బాగా జరుగుతున్నాయి. వైర్ల అపహరణతో రైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లటంతోపాటు పంటలకు నీటితడుల సమస్య ఏర్పడుతోంది. పోలీసులు స్పందించి కేబుల్ వైర్ల దొంగతనాలను అరికట్టాలి.

– కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, తోట్లవల్లూరు

**చర్యలు తీసుకుంటాం**



పంట పొలాల్లో రైతులకు సంబంధించిన మోటార్ల విద్యుత్ కేబుల్ వైర్ల దొంగతనాలు ఇటీవల కాలంలో పెరిగిన మాట వాస్తవమే. రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేశాం. సాంకేతికపరమైన అంశాలను పరిశీలిస్తూ చోరీల అదుపునకు మా వంతు చర్యలు తీసుకుంటున్నాం.

– అవినాశ్, ఎస్‌ఐ, తోట్లవల్లూరు

# కైకలూరు-వాడపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



కైకలూరు ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి వాడపల్లికి వెళ్లే బస్సు డ్రైవర్, కండక్టర్‌ను సన్మానించిన నాయకులు

కైకలూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు సౌకర్యాన్ని శనివారం ప్రారంభించారు. ఏలూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకట రామప్రసాద్ ఏలూరు ఆర్టీసీ డిపో అధికారులకు ఇక్కడ భక్తుల మనోభావాలను తెలియజేయడంతో ప్రతి శనివారం ఉదయం బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా బస్ డ్రైవర్ శివ, కండక్టర్ మరళీలను బీజేపీ నేతలు సన్మానించారు. కైకలూరు బస్టాండ్ నుంచి ప్రతి శనివారం ఉదయం 5 గంటల నుంచి బస్సు బయలుదేరి వాడపల్లి 8.30 గంటలకు చేరుతుందని కండక్టర్ తెలిపారు. అలాగే తిరిగి అక్కడ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి కైకలూరుకు 3.30 గంటలకు వస్తుందన్నారు. రానుపోను 250 కిలోమీటర్ల దూరం ఉంటుందని, ఒక్కొక్కరికి రూ.260 టికెట్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. ఏలూరు జిల్లా బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి బొల్లా శ్యామలరాజు గౌడ్ పాల్గొన్నారు.

# ప్రముఖ సంగీత విద్వాంసురాలు వరలక్ష్మి మృతి



చోడవరపు వరలక్ష్మి (ఫైల్)

గుడివాడ టౌన్: ప్రముఖ సంగీత విద్వాంసురాలు, పురపాలక సంఘ పాటశాలలో సంగీత ఉపాధ్యాయిని చోడవరపు వరలక్ష్మి(92) శనివారం మృతిచెందారు. స్థానిక ఎస్‌జీవీఎస్‌జీ మున్సిపల్ హైస్కూల్, ఏజీకే మున్సిపల్ హైస్కూల్లో సంగీత ఉపాధ్యాయినిగా సేవలందించిన ఆమె 1992లో పదవీ విరమణ పొందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విద్యను ప్రోత్సహించేందుకు ఆమె ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని చారని సహచర ఉపాధ్యాయులు తెలిపారు. 7, 10 తరగతుల విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఆమె నగదు బహుమతి అందజేస్తూ రావడంతో పాటు స్థానిక ఏజీకే హైస్కూల్ ప్రాంగణంలో కళావేదిక నిర్మాణానికి రూ. 35 వేలు వితరణగా ఇచ్చారని పేర్కొన్నారు. వరలక్ష్మి మృతి పై విశ్రాంత హెచ్‌ఎంలు జి. శారద, జి. ప్రమీల, పుట్టి నాగలక్ష్మి, డి. రజనీ కుమారి, ప్రధానోపాధ్యాయులు నర్సమాంబ, సంధ్యా తదితరులు సంతాపం ప్రకటించారు.

# వెంకటేశ్వరస్వామికి మొక్కుల చెల్లింపు



అలంకరణలో స్వామివార్ల ఉత్సవమూర్తులు



భక్తులకు అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వరస్వామికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

**నేడు వెంకటేశ్వరస్వామి మాస కల్యాణం**

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం స్వామివార్లకు వేద పండితులు మాస కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు.

# అంబేడ్కర్ విగ్రహం తిరిగి ఏర్పాటు



క్రేన్ సాయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ముదినేపల్లి రూరల్: స్థానిక బస్టాండ్ ఎదురుగా అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటుచేశారు. గతంలో జాతీయ రహదారి పక్కన బస్టాండ్ ఎదురుగా ఈ విగ్రహం ఉండేది. రహదారి విస్తరణలో భాగంగా హైవే అధికారులు ఈ విగ్రహాన్ని తొలగించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు. విగ్రహాన్ని తొలగించే సమయంలో నూతనంగా దిమ్మెను నిర్మించి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేస్తామని హైవే అధికారులు విగ్రహ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా నూతనంగా దిమ్మెను నిర్మించి క్రేన్‌సాయంతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. దీంతో విగ్రహ కమిటీ సభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, హరిప్రసాద్, వరప్రసాద్, రవిశంకర్, విజయసాగర్, కారే గౌతమ్, పళ్లెం పుణ్యేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

## దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



గుడివాడ టౌన్: దివ్యాంగుల అభ్యున్నతికి తాము కృషి చేస్తామని ప్రపంచ వికలాంగుల అభివృద్ధి సంస్థ కన్వీనర్ సీహెచ్ మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో అనంతపురం జిల్లాలో ప్రారంభమైన తమ సంస్థ సేవలు ఇతర జిల్లాల్లో కూడా నిర్వహించాలనే సంకల్పంతో గుడివాడలో నూతన కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ స్పోర్ట్స్ డైరెక్టర్ పి. శివనాగేశ్వరరావు, పీఆర్‌ఓ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలి



నందివాడలో ఉపాధి పనులు కల్పించడం లేదని ఫిర్యాదు చేస్తున్న రుద్రపాక మహిళలు

పెదపారుపూడి: ఉపాధి హామీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పని కల్పించాలని డ్వామా పీడీ శివప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామాల వారిగా ఉపాధి హామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల మస్టర్లలో అవకతవకలను గుర్తించారు. సుమారు రూ.87 వేలు రికవరీ చెల్లించాలని ఫీల్డు అసిస్టెంట్లను ఆదేశించారు. ఎంపీపీ గోగం సురేష్, ఎంపీడీఓ టీ. సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

**నందివాడలో..**

నందివాడ: ఉపాధి పనులపై డ్వామా పీడీ శివప్రసాద్ శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు గ్రామాల వారిగా ఫీల్డ్ అధికారులు చేపట్టిన పనులపై విచారణ చేపట్టారు. పలు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు రోజువారి కూలీలపై అశ్రద్ధగా వ్యవహరిస్తున్నారని, కొన్ని చోట్ల ఫీల్డు అసిస్టెంట్లు లేకపోవడంతో మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలు ఊర్లో లేక పోయినా వారి ఖాతాలో నగదు జమ అవుతుందని, పని చేసిన వారి ఖాతాలో డబ్బులు పడడం లేదని పలువురు ఆరోపించారు. రుద్రపాక గ్రామంలో ఉపాధి పనులకు వస్తామన్నా కూలీలకు పని కల్పించడం లేదని ప్రాజెక్ట్ డైరెక్టర్ శివప్రసాద్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని తప్పనిసరిగా కల్పించాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.ఆదాం, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఏఓ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో రహదారి ఏర్పాటు



నందివాడ: జనార్దనపురం విష్ణు విలాసిని ఎస్టేట్ నగర్‌లో దెబ్బతిన్న ప్రధాన రహదారిని గాదిరెడ్డి సార్వ భూమారెడ్డి తన సొంత సొంత నిధులు రూ.70,000 ఖర్చుపెట్టి 200 మీటర్ల రహదారిని ఏర్పాటు చేశారు. చిన్నపాటి వర్షం పడినా స్కూలుకు వెళ్లడానికి కూడా పిల్లలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో చేసేదేమీ లేక సొంత నిధులతో రహదారి ఏర్పాటు చేశామని సార్వభూమారెడ్డి తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు

ముదినేపల్లి రూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ వై రామకృష్ణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 19న అతి తక్కువ మంది కూలీలతో పని చేయించడం, పని కల్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు 25 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులో పేర్కొన్నారు.

## 26 నుంచి కల్యాణోత్సవాలు

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి 28 వరకు 43వ వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్స్ కార్యనిర్వాహణాధికారి కే దివ్యశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



రాష్ట్ర రైతు విభాగ సెక్రటరీ సయ్యపురాజు గుర్రాజును సన్మానిస్తున్న డీఎన్నార్

కైకలూరు: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. పార్టీ కార్యాలయం వద్ద ఇటీవల నియమితులైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ సెక్రటరీ సయ్యపురాజు గుర్రాజును శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా గుర్రాజు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీ మహాదేవ విజయబాబు, డీఎన్నార్ కుమారులు దూలం వినయ్, శ్యామ్, కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాంబాబు, పల్లెవాడ, భుజబలపట్నం ఎంపీటీసీ సభ్యులు బంటుమిల్లి కొండయ్య, సూర్యనారాయణరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు సోమల శ్యామ్‌సుందర్, నాయకులు వేణు, అన్నవరం, మురళీ, అంజి, నాగు పాల్గొన్నారు.

# ఎండోమెంట్ భూమికి రక్షణ ఏదీ?



ఎండోమెంట్ ల్యాండ్‌లో పోసిన చెత్తను చూపుతున్న మేనేజర్ వెంకటేశ్వరరావు

పామర్రు: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన కోట్ల విలువ చేసే ఎండోమెంట్ భూమికి రక్షణ లేకుండా పోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. విజయవాడ రోడ్డులోని పెట్రోల్ బంక్‌కు ఎదురుగా ఎండోమెంట్ భూమి సర్వే నంబరు 111లో ఉన్న 5.92 ఎకరాలు ఉంది. ఈ పొలంలోకి చుట్టుపక్కల వారు వాడిన మురుగునీటిని వదలటంతో పంటలు పండక బీడుగా మారిపోతోంది. గతంలో లీజుదారుడు ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో చుట్టు పక్కల వారి మురుగు నీరు పొలంలో చేరుతోంది. ఈ భూమిలో రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం తాగు ఆ బాటిల్స్‌ను అక్కడే పడేసి వెళ్లిపోతున్నారు. అంతే కాకుండా చుట్టుపక్కల వారు చెత్తను ఎండోమెంట్ భూమిలోనే పడవేస్తున్నారు.స్థానిక కాంట్రాక్టర్లు కొందరు వారికి సంబంధించిన ఇసుక, కంకర, రాళ్లు తదితరాలను ఎండోమెంట్ ల్యాండ్‌లో గుట్టలుగా పోసి నిల్వ చేసుకుంటున్నారు. లారీ యజమానులు వారి లారీలను కూడా ఇక్కడే పార్కింగ్ చేయడంతో ఎండోమెంట్ ల్యాండ్ ఆక్రమణలకు గురవుతోంది. పొలం లీజుదారుడు ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎండోమెంట్ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావును శనివారం వివరణ కోరగా ఎండోమెంట్ భూమిలో ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పామర్రు ఎమ్మెల్యేను కలిసిన గుడివాడ ఎమ్మెల్యే



పామర్రు ఎమ్మెల్యే కుమార్‌రాజాను కలిసిన గుడివాడ ఎమ్మెల్యే రాము

పామర్రు: పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను శనివారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పామర్రు ఎమ్మెల్యే గుడివాడ ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఇరువురు వారి నియోజకవర్గాల గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆధారాలు చూపితే చర్యలు

ముదినేపల్లి రూరల్: దళితులకు కేటాయించిన భూముల ఆక్రమణలకు సంబంధించి తగిన ఆధారాలు చూపితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జేఎస్ సుభానీ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. మండలంలోని వైవాకలో దళితులకు కేటాయించిన భూములు ఆక్రమణలకు గురికాగా దీనిపై 'ఆక్రమణలు తొలగవు–సాగు సాగదు' శీర్షికన సాక్షిలో శనివారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఏయే సర్వే నంబర్లలో ఆక్రమణలు జరిగిందో ఒరిజినల్ అసైన్దారులు వారి వివరాలతో అర్జీ ఇచ్చి ఆధారాలకు సంబంధించిన నకళ్లు జత చేస్తే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని ఎండార్స్‌మెంట్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పోద్రు జోషి అనే దళిత నాయకుడికి తెలియజేశామన్నారు. అదే విధంగా గ్రామంలో 25 ఎకరాల మిగులు భూమి పంపిణీ చేయాలని అర్జీ ద్వారా కోరగా అసైన్డ్ కమిటీ ఏర్పడిన తరువాత అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని స్పష్టం చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ముదినేపల్లి రూరల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంతో పాటు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉందన్నారు. వేసవిలో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ వై రామకృష్ణ, తహసీల్దార్ జేఎస్ సుభానీ, కో–ఆప్షన్ సభ్యుడు అల్లాభక్షు పాల్గొన్నారు.

# అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



తామరకొల్లులో రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కైకలూరు: నియోజకవర్గంలో అంతర్గత రహదారులను మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ నిధులతో నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వేమవరప్పాడు, తామరకొల్లు, ఆచవరం గ్రామాల్లో రహదారులను శనివారం ప్రారంభించారు. అనంతరం కైకలూరు సచివాలయం–2లో పూజలు చేశారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా వద్ద నియోజకవర్గంలో ముదినేపల్లి, కోడూరు, ఈడేపల్లి, కాళ్లపాలెం, కోరుకొల్లు, కలిదిండి, వరహాపట్నం, చటాకాయి, సింగనపూడి, ఇంగిలిపాకలంక గ్రామాల్లో 10 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10,67,199ను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నాయకులు వీరమల్లు నరసింహారావు, పూలా రాజీ, ఎండీ. జానీ, మంగినేని రామకృష్ణ పాల్గొన్నారు.

## 'కుక్కల బెడద నుంచి కాపాడండి'

గుడివాడ టౌన్: స్థానిక సత్యన్నారాయణపురంలోని చిన రామాలయం రోడ్‌లో ఊరకుక్కలు అధికంగా ఉండి రోడ్డుపై వెళుతున్న చిన్నారులపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం ఓ చిన్నారిపై దాడి చేయడంతో గాయపడింది. దీంతో సత్యన్నారాయణపురానికి చెందిన చిన్నారులు సామూహికంగా గుడివాడ మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తూ 'కమిషనర్‌గారూ పిచ్చికుక్కలను అదుపు చేయండి' అంటూ వీడియో తీసి మున్సిపల్ కమిషనర్‌కు పంపారు. వాటిని అదుపుచేసి పిల్లలు కుక్క కాట్లకు గురికాకుండా చూడాలని కమినర్‌ను కోరారు.